
# ఆడపెత్తనం

భుజా లెగరేసుకుంటూ హోటల్‌లో ప్రవేశించాడు భుజంగం! అతని మస్తిష్కం ప్రమోదంతో నిండిందన టానికి గట్టి సూచనన్నమాట!

సర్వకాల సర్వావస్థలలోను ముఖాన జావకారుస్తుండే భుజంగం పుష్కరాని కో మారు భుజా లెగరేస్తుంటే పరిచయస్తు లకు వింతగావుండటంలో ఆశ్చర్యంలేదు.

అందులో ఆఫీసు కొలీగ్ సుందరా నికి చీకట్లో సూర్యుడు కనిపించినంత విస్మయం కలిగింది.



అభిమన్యు

దానికి ఒక విచిత్ర కారణ ముంది.

స్వతహాగా సుందరం సుందరమైన వాడు కాదు. ముక్కు కొంచెం పొడుగ్గా వుండి గరుత్మంతుణ్ణి జ్ఞప్తికి తెస్తుంది. దవడలు నిగ్గుతేలి సున్నగా వున్నా యిబ్బంది లేదు. కాని, అవీ కూడ లోతుకు పీక్కుపోయినయ్, వామన గుంటల్లా!

అసంఖ్యాకంగా ప్రజలు హాజరయే ఏ పెద్ద బహిరంగ సభలో కూర్చున్నా సుందరం, అతని వెనక కూర్చుండే కొన్ని వందలమంది, ముందు చూపు కరువై శిరోభారంతో బాధపడవలసిందే! ఎత్తు అలాగుంటే లావు సంగతి మరీ ఘోరం! అంటే వాకిలి పట్టడనికాదు అర్థం – పూచికపుల్లే నయమని!

అలాంటి విలక్షణ స్వరూపుడైన సుందరం భుజంగానికి మల్లేనే నిరంతరం బావురుమంటుంటాడు. సాధారణంగా ఆ రెండు దుర్బలజీవులూ హోటల్‌లో కలియని రోజుండదు. వన్‌బై టు కాఫీ త్రాగటానికి లోగడనే వాళ్ళిద్దరు ఒక ఒప్పందం కుదుర్చుకునియున్నారు. ఆ ఒప్పందాన్ని ఏ ఒక్కరు తప్పినా రెండో వానికి ప్రమాదమే. ఆ పూట కాఫీలేక ఉధృతమైన తలనొప్పి వచ్చి, ఆపాద మస్తకం కంపించిపోతుంది. పోనీ తెగించి ఫుల్ కాఫీ త్రాగుదామని సంకల్పిస్తే, బడ్జెట్‌లోని అంకెలు భూతద్దం లోకి అక్షరాల్లా స్పష్టంగా కనిపిస్తయ్ స్మృతిపథంలో. నెలనెలా సప్లిమెంటరీ బడ్జెట్ సమర్పిస్తే అసలు బడ్జెట్టుకే ముప్పు వాటిల్లగల హటాత్పరిణామం రావచ్చు.

భుజంగం ఆహ్లాదకరంగా కనిపించటంతో సుందరం హతాశుడైనాడు.

ఆ లోటుబడ్జెట్ వెధవకు యింత సంతోషం ఏమూలనుంచి వచ్చిపడిందా అని తీవ్రంగా విచారించాడు. పోనీ, తన దగ్గరికి రాకపోతే పోయె – కనీసం ఒకసారి తనవంక చూచి 'విష్' చేయకూడదూ?

సుందరానికి నిజంగానే కోపమొచ్చింది. నిజమైన కోపానికి నోచుకోని నిర్భాగ్యుడు కావటాన, ఆ వచ్చిన కోపానికి, హృదయం పొంగిపోయింది. కోపంలోకూడ అంత మాధుర్యముంది కాబోలు అని తియ్యగా నవ్వుకున్నాడు. ఎంత నవ్వుకున్నా, ప్రాణంమటుకు భుజంగంపట్ల గిలగిలలాడుతూనేవుంది.

పదిగజాల దూరంలో వున్న భుజంగాన్ని మింగేసేటంత చురుగ్గా చూచాడు సుందరం.

భుజంగం ఏకాగ్రతలో వున్నాడు.

మొదటివాయి వేడివేడి యిడ్లీ.

'కాలహరణ మేలరా' అన్నట్లు చేతులు ప్లేట్లోనే కడిగేశాడు.

సుందరానికి తను ఎంత నష్టపోతున్నాడో దృష్టికి గోచరించేసరికి, మలేరియా ఆవహించినట్లయింది!

వైటర్ మూడుసార్లు వచ్చి వెళ్లాడు.

తను ఆర్డ రివ్వలేకపోయాడు.

సుందరం కోపంలో మరో రసం మిళితమైంది. అదే శోక...

మిన్నువిరిగి మీద పడినాసరే,

సూర్యచంద్రులు తమ గతులు తప్పనీ,

పగలే వెన్నెల కాయుగాక,

ఇంటిదగ్గిర పెళ్ళాం మొగుడైనాకానీ,

నాలుగోసారి వైటర్ వచ్చినప్పుడు–

ఆలోచించకుండా–

ఆముదం ముఖం పెట్టకుండా–

ఫుల్‌కప్ కాఫీకి ఆర్డ రివ్వవలసిందే!

భుజంగానికి చెప్పున కొట్టినట్టుంటుంది! తను మధురానుభూతిలో తేలి పోతుంటే చూడకుండా వుంటాడా? చూచి కుళ్ళి చావడూ?

వాడి జన్మలో, యీ హొటల్‌లో, ఎప్పుడైనా ఫుల్‌కప్పు కాఫీ సేవించి యుంటాడా? తను షేర్ కలవకపోతే అసలు కాఫీ వాసన యెరిగేవాడేనా అని?

సుందరం మనస్సు ఉద్రేకంలో చల్లబడ్డది – కాఫీకి అర్డ రిచ్చాడు.

రెండోవాయి దంచుతున్నాడు భుజంగం. సుందరానికి వళ్ళు మండింది.

భుజంగం పెసరట్టును పొదివి పొదివి పట్టి తింటున్నందుకు కాదు – వాడి బొంద రుచి – దానికి ఉప్మానుకూడ జోడించట మెందుకు అని?

సుందరం అంతలోనే కోపం మాను కుని వికటంగా నవ్వుకున్నాడు.

ఎప్పుడో వైటర్ చెప్పిన సంగతి జ్ఞాపక మొచ్చింది. దానికి 'యం. ఎల్. ఏ. అట్టు' అని పేరుందనీ, దాన్ని తిన్నవాడల్లా యం. ఎల్. ఏ. అవుతాడని ఉబ్బిపోతే అర్థ మేముంది? కోతికి కొబ్బరి కాయ దొరికినట్లు, ఏ బాపతో రెండు రూకలు జేబులో పడినట్లుంది. మేకలాగ మేస్తున్నాడు.

కాఫీ వచ్చి ముందు నిల్చుంది.

భుజంగం పొరపాటుననైనా తలెత్తటం లేదు.

సుందరానికి దిగులు పుట్టింది.

భుజంగం భూలోకంలోకి దిగివచ్చేట్లు లేదు.


కాఫీ చల్లారి పోవటానికి తొందర పడుతోంది.

దాన్ని పరిష్కరించాలనేమో మనసు వురకలు వేస్తోంది.

ఎంతో 'రిస్క్' తీసుకుని ఫుల్‌కప్పు కాఫీ త్రాగుతున్నా ... మధ్యలో ఎన్నో అవరోధాలు, చిక్కు ప్రశ్నలు...చీదర పెట్టే సమస్యలు.

ఇంతకంటే కాఫీ అలవాటుకు స్వస్తి చెప్పటం ఉత్తమ మనిపించింది సుందరానికి.

ఆ సంకల్పం బుద్బుదప్రాయమైందని వెంటనే హృదయం ఘోషించింది– దృష్టి అటుగా సారించినపుడు, అంటే భుజంగం మూడోవాయి తిరగేస్తున్నప్పుడు.




అట్టుమీద అట్టేమిటి — అన్‌కల్చర్డ్ బ్రూట్ —. రవ్వట్టయితే మటుకు అట్టు కాకపోతుందా?

సుందరం కాఫీవంక కోరచూపు విసిరాడు.

అంతరవకూ పైకెగసిపోతున్న పొగలు, మా కాలం తీరిపోయిందన్నట్లు అనంతవాయువులో యేకమై సుందరాన్ని వెక్కిరించాయి.

భుజంగంకాఫీ పొగలు కక్కుతూంది.

సుందరానికి దుఃఖం పొర్లుకొచ్చింది.

ప్రీతిగా వేడికాఫీని చెంచాతో అందుకొని 'సిప్' చేశాడు భుజంగం.

కప్పును పెదవులమధ్య బంధించి రెండు గుటకల్లో ఖాళీ చేశాడు సుందరం కసిగా.

బిల్లు తీసుకొని ఠీవిగా కౌంటర్‌దగ్గరికి వెళ్ళాడు భుజంగం.

వెళ్ళేవాడు తన మానాన తను వెళ్ళితే సుందరానికి వికారం కలిగేదికాదు.

“హలో సుందర్...'' అని ఒక జాలినవ్వు చిందించి, తన బిల్లునుకూడ పెద్దఘరానాగా చేతికి తీసుకోవటంతో సుందరం శరీరంమీద జెర్రులు ప్రాకినట్లయింది.

కాని నిస్సహాయుడు.

వట్టి మెహమాటం మనిషి.

'వద్దులేవోయ్' అని నోటూర నివారించలేక, ఒక 'చావు' నవ్వు నవ్వేశాడు.

ఇద్దరూ కలిసి రోడ్డుమీది కొచ్చారు.

ఇంటిదగ్గరినుంచి తెచ్చుకున్న రెండు పలుకుల్లో మిగిలిన వక్కపలుకును పండ్ల మధ్య యిరికించాడు భుజంగం.

సుందరం ఆ దృశ్యాన్ని చూడలేకపోయాడు.

“ఏరా సుందర్, యివాళ భలేగా యస్కేప్ అయ్యావే! మధ్యమధ్య యిలా మోసం చేశావంటే నేను యిబ్బందిపడిపోతానుసుమా! నీకోసం చూచి, కళ్ళు కాయలుకాచినయంటే నమ్ము...”

భుజంగం ఎంతో ఫీలవుతూ అబద్ధ మాడుతుంటే, అమాంతం వాడిముఖాన్ని ఇనపగోళ్ళతో రక్కి వేయా లనిపించింది సుందరానికి! ఆ ఆక్రోశాన్ని మాటల్లో మడిచిపెట్టి అన్నాడు.

"ఓరేయ్ భుజంగం! నీ ధోరణి ఎట్లావుందంటే తాతకు దగ్గు నేర్పిన ట్లుంది! ఇలాంటి అబద్ధాలు నీవు నా దగ్గర అభ్యసించినవేకదా! అబద్ధము ఆడినా సొల్యూషన్‌తో పంచర్ అతికిన ట్లుండాలి కానీ, పచ్చడితో పప్పు కలిపి నట్లు కాదు..."

భుజగం ముఖం వెనకటి చిల్లికానీలా వికృతంగా మారిపోయింది.

"క్షమించు బ్రదర్, తొందర్లో నిన్ను మర్చిపోయా నేమో బహుశః..." అన్నాడు దైన్యంగా.

"ఆ 'బహుశః' ఎందుకు తోకలా! కావాలని మరిచిపోయానంటే నిన్ను హత్య చేస్తానా?"

సుందరం ఉక్రోషం విషంలా కక్కేశాడు.

"సారీ సుందర్ ..."

ముక్తసరిగా తప్పు నొప్పుకున్నాడు.

"భుజంగం, నీకు ఏటాపతో కొంత డబ్బు చేతిలో పడింది. అన్నార్తుడివలె హోటల్‌కు పరుగెత్తుకొచ్చావు—నా కష్టాన్ని కాలదన్ని కడుపు నింపు కున్నావు. నీవు ద్రోహివి! లుబ్ధుడివి!! స్వార్థపరుడివి!!! చవటవు ... ఇంకా ..."

సుందరం భుజంగాన్ని ముఖం వాచే టట్లు చీవాట్లుపెట్టి—అడుగును ఆరంతలు చేసుకుంటూ చరచర వెళ్ళిపోయాడు...

భుజంగం నిర్జీవుడైనాడు ...

* * *

ముప్ఫయవ తారీఖు!

సుందరం ఆఫీసుకు బయల్దేరు తున్నాడు.

కాంతం నవ్వుకుంటూ దగ్గరికి వచ్చి,

"జూలై నెలకు ఎన్ని రోజులండీ?" అంటూ చిలిపిగా ప్రశ్నించింది.

ఐ. ఏ. యస్. యిన్‌టర్వ్యూలో తిక మక పడ్డ అభ్యర్థిలా సుందరం కూడా తెల్లమొహం వేశాడు తక్షణం.

ఆలోచిస్తే ఓడిపోయినట్లే!

తప్పు చెప్పినా అదే ఫలితం!!

సుందరం తన మేధస్సును నాలుక మీదికి దిగుమతి చేసినవాడై,

"నాకంటే నీకే బాగా తెలుసు ..." అన్నాడు కాంతం చెక్కిలిమీద చిటిక వేస్తూ.

"కాదు ..."


"ఔను ..."

"కానేకాదు ..."

"ఔనంటే ఔను ..."

"అయితే మీదగ్గర బడ్జెట్ ఎంత వుంది?"

"బడ్జెట్ నిల్...జేబు ఖాళీ..."




"అబద్ధం !"

"కాదు ..."

"పచ్చి అబద్ధం ..."

"కాదంటుంటేనూ ..."

"ఏమండీ... మీరు వళ్ళు మరిచి పోతున్నారు," కాంతం స్వరం ఖంగున మ్రోగింది కంచుఢక్కలా

సుందరానికి వళ్ళు తెలిసింది !

జరిగిన సంభాషణను నెమరు వేసు కున్నాడు.

అంతే; గుండె జారి అరచేతిలో పడ్డట్లు, నిలువెత్తు మనిషీ నీరై పోయాడు.

"నెలకు కాఫీ ఖర్చుక్రింద మూడు రూపాయ లిచ్చాను ..."

కాంతం అధికారస్వరం ఆఫీసర్ కేకలా వుంది.

ఒకటోక్లాసు విద్యార్థిలా జవాబు చెప్పాడు సుందరం.

"ఔను, మూడు రూపాయ లిచ్చావు..."

"వన్ బైట్ కాఫీ 10 పైసలు కావున, 80 రోజులకని మూడురూపాయ లిచ్చాను. ఈరోజు 30వ రోజు, ఇంకా మీరు కాఫీ త్రాగలేదు... అంటే మీ జేబులో కనీసం పదిపైస లుండితీరాలి! లేవని బుకాయిస్తున్నారు ! కారణ మేమిటి ?"

"నిన్న భుజంగం నన్ను నిలువునా ముంచేశాడు. ఆ పాపం వాణ్ణి కాల్చుక తినకపోదు కాంతం ? అందుచేత... నిన్న ఫుల్‌కప్పు కాఫీ త్రాగవలసిన ఖర్మం పట్టింది. అయినా యిప్పుడు నిన్ను సప్లిమెంటరీ బడ్జెట్ శాన్‌క్షన్ చెయ్యమని ఏడవటంలేదుగా !"

"ఆ ఏడుపే వద్దంటున్నాను ! సరే యీసారికి మన్నించాను. ఈ నెలలో 31 రోజు లన్న సంగతి జ్ఞాపకం లేక పది

పైసలు తక్కువిచ్చాను. అంటే పొరపాటు చేశానన్నమాట! అందుకే మన్నించాను. ఇవిగోండి — యీ యిరవై పైసలు, యివాల్టికీ, రేపటికీను..." అంటూ బొడ్డునున్న చిన్న సంచీలో నుంచి నాలుగైదు పైసల బిళ్ళలు సుందరం దోసిట్లో పోసింది కాంతం

'బ్రతికానురా జీవుడా!' అనుకుంటూ సుందరం వాయువేగంతో వీధిలో కొచ్చిపడ్డాడు.

ఆఫీసు అరమైలు దూరంలో వుంది.

హాయిగా నడిచేపోతే శరీరానికి ఆరోగ్యమని చెప్పింది కాంతం.

సుందరం నిర్లిప్తంగా అడుగులేస్తున్నాడు.

అతని నిర్లిప్తతను నిరసిస్తూ సూర్యుడు తన వేడి కిరణాలతో సుందరం నుదురుపై చురుకున పొడవసాగాడు.

సూర్యుడి పొగరుబోతుతనాన్ని లక్ష్యపెట్టలేదు సుందరం. అతని ఆలోచనలు కాంతం చుట్టూ పరిభ్రమిస్తున్నయ్! జేబులోకి చేయిని పోనిచ్చి 'కర్ చీఫ్' తీసుకోవటానికికూడ యిష్టపడలేదు మనసు.

కాంతం నియంతృత్వ విధానంవల్ల తన జీవితం అడకత్తెరలో పోకచక్కలా తయారవుతోంది. రోజురోజుకూ తను మరీ బానిసై పోతున్నాడు.

తనదీ ఒక పుటకేనా?

తనదీ ఒక బ్రతుకేనా?

ప్రతినెలా ఒకటో తేదీన, అధవా రెండోతేదీనైనా ఫెళఫెళ మనే రెండు వందల రూపాయల కొత్తనోట్లు కాంతం చేతుల్లో పెట్టి నీళ్ళు విడుస్తాడు.

దాని బడ్జెట్ ఏమిటో, అదేమిటో?

స్వతంత్రించి ఒక్క కాకీపాంటు కుట్టించుకునే రాతలేదు తన బ్రతుక్కి.

'రామ రామ' నెలకు మూడురూపాయలా కాఫీకర్చు. తన విలువ మరీ అంత వందలపైసల్లోనే పరిమితమై పోయిందా?

అనలేక అరిచిచచ్చినట్టు వూరుకోవటమే కాని, అదే మరొక మగాడయితే కాంతాన్ని చెత్తచెత్తగా తన్నేయును.

మరి తనలో వచ్చిన లోప మేమిటి?

అసలైన సిసలైన పురుషుడవటానికి తార్కాణంగా ఒక వంశోద్ధారకుడు, కన్యాదానం ఫలితందక్కించటానికి ఒక ఆడముం ."

సుందరం నాలుక కొరుక్కున్నాడు.

పొరపాటున ఆమాట పెదవి జారి బైటపడితే, దాన్ని, ప్రక్కన పోయే ఏనారీరత్నమైనా వింటే ఎంత ప్రమాదం!

దేశంలో తిండి తినటానికి నోళ్ళు తక్కువయినట్లు ఆ యిద్దరూ అవతరించారు.

ప్రాణాలు తోడేస్తుంటారు — మోట బావిలో నీళ్ళను తోడినట్లు.

దాంతో కాంతానికి ఆత్మబలం వృద్ధి అయింది.



ఎదిరించడమంటే వేరుశనక్కాయ
కొరికినంత సులభం. బెదిరించటమంటే
నీరు తాగినంత తేలిక.

తను అసమర్థుడు.
తను అవివేకి.
తను చవట.

తను కొజ్జా......

ఆవేశ మనే అగ్ని సుందర మనే కట్టెను దహించి బూడిద చేసింది.

ఇప్పుడు జేబుగుడ్డ తీయక తప్ప లేదు.

అకస్మాత్తుగా కళ్ళు విశాలంగా సాగినయి.

కాంతం యిచ్చిన యిరవై పైసలతు తోడు, మరో ఇరవై పైసలుకూడా చేతికి తగలటంతో ప్రాణం పాదరసైజులోకి ఎగిసిపోయిన ట్లయింది.

తను ఎంత నిరర్థకుడు.

తనది ఎంతటి మందబుద్ధి.

పాపం భుజంగం పుణ్యమా అని యిరవై పైసలు మిగిలి పోయినయ్!

పరేవ్వా, త నెంత లక్కీ-పర్సన్.

రోజుకు యిరవై పైసలు ఖర్చు పెట్టుకోవచ్చు.

"అరే సుందరం! నీకీ మాత్రం సంతోషమైనా నీ శ్రీమతి నిర్వహణ దక్షతవల్లె చేకూరుతున్నదే! ఇప్పుడైనా గ్రహించు."

అంతరాత్మో, ఆకాశవాణో అర్థం కాలేదు సుందరానికి.

గుండెమీద చెయి వేసుకున్నాడు. శబ్దతరంగాలు ప్రసరిస్తున్న ఆనవాలు ఏమీలేదు.

శూన్యంలో కలియజూచాడు.

ఎండ మిడిసిపడుతోంది.

చూస్తే కాలుస్తా నన్నట్లుంది.

సుందరం వెకిలిగా నవ్వేశాడు.

తనకు ఆత్మలేదు—దానికో అంత ర్భాగంకూడా ఎక్కడుంటుంది?

ఇక ఆకాశవాణి సంగతి విచారిస్తే, అభినవ 'ఆకాశవాణి' అవతరించాక అసలు వాణి నెత్తిన వోణీ వేసుకు కూర్చుంది—వెధవముండలా!

అయితే తనకా దివ్య సందేశాన్ని అందించిన మనిషి ఎవరబ్బా?

తన కాంతాన్ని అంతయిదిగా మెచ్చు కున్న హృదయం చచ్చుదెలా అవు తుంది?

సడన్‌గా వెనక్కుతిరిగి చూచాడు.

పర్లాంగు దూరంలో భుజంగం లీలగా కనిపించాడు.

సుందరంలో ఉత్సాహం జనించింది.


'దివ్యబోధను' దివ్యంగా మరిచి పోయి, రెప్ప వాల్చకుండా భుజంగాన్నే చూస్తూ నిలుచున్నాడు.

అల్లంత దూరాన వున్న భుజంగం 'గొత్తె పొటేలు' పోజులో పాదయాత్ర సాగిస్తున్నాడు.

సుందరం తనతో విరోధం తెచ్చు కున్నందుకు విచారిస్తున్నట్లుంది భుజంగం వాలకం.

సుందరానికి కూడా అదే భావన కలిగి, వళ్ళంతా తేనె పూసినట్లు, నాలుక ఎగరేస్తూ నవ్వుకున్నాడు.

తనతో స్నేహం చేసిన వాళ్ళు కొల్లలు—ఎవరైనా అంతే. తనను ఒక్క




రోజు చూడకుండా వుండలేరు! కాల వశాత్తు కయ్యం లేక కలహంవంటిది ప్రాప్తించినా అవతలవాడు దిగులుతో మంచ మెక్కవలసిందే కాని, తనకు చీమకుట్టినట్లయినా వుండదు. ఏమిటో తనలోని ఆ ప్రత్యేకత! ఎన్నోసార్లు తనకు వన్‌డర్‌ఫుల్ అనిపించింది. ఆడదానిలో లేనంత ఆకర్షణ తనలో వుండంటే వండర్ గాక ఐడియాలో బ్లండర్ ఏముంది?

భుజంగం సమీపించాడు.

"హలో సుందర్!" అంటాడేమోనని ఆశించి, హతాశుడై,

"హలో భుజంగ్!" అంటూ తనే 'విష్' చేశాడు సుందరం.

పొట్టేలు తల పైకి లేచింది.

కళ్ళలో నీళ్ళచారలు.

ముఖంమీద విచారమేఘాలు!!

శిరస్సుపై విషాద భాండం.

సుందరం దృక్కులకు గోచరించాయి.

"భుజంగ్...!" అంటూ ఆవేదనా భరితంగా ఆలింగనం చేసుకుందామనుకున్నాడు.

కానీ, నడిరోడ్డు.

ఆఫీసు టైమూను.

రహదారంతా రణరంగంలా కోలాహలంగా వుంది.

తన ఆలింగనదృశ్యం మనుషుల్ని ప్రేక్షకులుగా మారిస్తే- ట్రాఫిక్ బంద్, న్యూసెన్సు...

"భుజంగ్, నన్ను మన్నించరా... నిన్న అలిగి వెళ్ళిపోయాను.." సుందరం క్రిందపెదవిని పంటితో నలుపుతూ అన్నాడు.

"మన్నించటానికి మేం ఎంతటి వాళ్ళం బ్రదర్? నీ కేం మహరాజువి. మంచి ఎఫిషియంట్ భార్యను సంపా

దించుకున్నావు. ఆవిడ బడ్జెట్ వేసిందంటే ఇండియా ఆర్థిక మంత్రులు చాలరు. ఏ నెల చూచినా 'సర్ప్లస్' తప్ప లోటనేది కనిపించకపోతే ఎక్కడ ఛస్తాం చెప్పు?" భుజంగం కళ్ళార్పుకుంటూ అన్నాడు.

"భుజంగ్ - నీ కేంతెలుసురా నేననుభవించే నరకం! ఎంత అస్వతంత్రుణ్ణో ఎంత వాజమ్మనో చచ్చిపోయిన నా అంతరాత్మకే తెలుసు..."

సుందరం భుజంగం ముఖం మీది విచారమేఘాల్ని తన ముఖంమీదికి ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాడు.

"సుందర్, రోజూ కలిసి అనుభవిస్తున్నవాళ్ళం నాకు తెలియదంటావేరా? కానీ నువ్వు వన్ లైట్ కాఫీని దృష్టిలో పెట్టుకుని నీ ఆవిడ పరిపాలనా దక్షతను ఆక్షేపిస్తే నే నొప్పుకోను...! కుక్కను కొడితే బాంకులో నుంచి రెండువేల రూపాయల్ని రాల్చగలవు.. మరి నేనో?..."

భుజంగంలో నైరాశ్యం తొంగి చూచింది.

"భుజంగ్, మనిషి క్కావలసింది ఫ్రీడం; డబ్బు కాదు. నేను నలిగి చస్తున్నాను..."

సుందరం ఖైదీమొహం పెట్టేడు.

అతడలా మాటమాటకు దరిద్ర మొహం పెట్టడం భుజంగానికి నచ్చలేదు. సంసారాన్ని చక్కగా తీర్చి దిద్దుకొచ్చే భార్యవుంది. ముందు జాగ్రత్త, దూరదృష్టి కలిగిన కాంతం ఎన్నడూ డబ్బుకటకట ఎరగదుకదా. కావాలంటే తృణమూ ఫణమూ అప్పులిస్తుందికూడ- వడ్డీ కయితే మాత్రం సహాయం చేసే గుణం అందరిదగ్గరుంటుందా? అలాంటి పొదుపరి భార్య దొరికినందుకు సంతోషించటం పోయి, అహోరాత్రాలు ఆముదం ముఖంతో అష్టావధానం చేస్తుంటుంది సుందరం బుర్ర.

"సుందర్, నీవు వట్టి బ్రూట్ వురా..." అనేశాడు ఠకీమని.

"ఏల నన్నిట్లు దూషించుచుంటివి?" సుందరం ద్విగుణీకృతమైన వ్యధతో చెప్పిన వచనం, ఫక్కీ మార్చుకుంది.

"ఏలనా...!" అని ఆవేశపరవశుడై భుజంగం-

"నీ భార్య మహాసాధ్వి; విజ్ఞాని, పతిభక్తి పరాయణురాలు; లెక్క ప్రకారం ఖర్చుచేయటం నేర్చిన ప్రవీణురాలు. ఇంకేం కావాలి చెప్పు? ఆడపెత్తనంలో ఎంత ఆనందముందో, అంతా నువ్వే అనుభవిస్తున్నావ్ ... నీ కేమిరా అదృష్ట జాతకుడివి..." అని దీర్ఘోపన్యాసం ద్వారా సుందరంలో పేరుకుపోయిన దురభిప్రాయాన్ని కడిగి పారేయా లనుకున్నాడు.

సుందరం ప్రతిఘటించాడు.

"భుజంగ్, నీకూ తెలుసు మన యిద్దరం ఆఫ్టరాల్ వన్ బై టూ



కాఫీతో రోజుల్ని గడ్డుగా గడుపుతున్నా మని. ఇలా నన్ను సుఖజీవిగా ప్రచారం చేస్తే నా బ్రతు కేం కాను? నా కేమిటి దారి?" అంటూ.

భుజంగం వూరుకోలేదు.

"సుందర్, నీ భార్య నీకు కడుపు నిండా తిండి పెడుతూందా లేదా? నా ముఖం చూచి చెప్పు."

"ఆ లోటు లేదు..."

"మధ్యాహ్నం ఆకలితో నల్లిలా మాడిపోకుండా, ఇంటినుండి టిఫిన్ తెచ్చుకుంటున్నావా లేదా?"

"అబద్ధ మేముంది?"

"నాతో బాటు వన్ బై టూ కాఫీ సేవిస్తున్న మాట యదార్థమే కదా! ఇక నీకు నీ భార్యవల్ల జరుగుతున్న

అపచార మేమిటి? నీవు ఫీలవుతున్న ఆ 'స్లేవరీ' ఎలాంటిది?..."

భుజంగం ఉద్రిక్తు డైనాడు.

సుందరం నివ్వెరపడి చూడసాగాడు.

భుజంగం కొనసాగిస్తూ –

"నా భార్య విషయం తీసుకుంటే, నేను చేతి కిచ్చే రెండువందల రూకలను పదిహేను రోజుల్లో పోకల్లా నవిలేస్తుంది. ఆ పైన నా మీద దండయాత్ర! అప్పులు చేయుట తనవంతు, వాటిని తీర్చటం నా వంతు. అదేమిటి నన్ను ముంచేస్తున్నావు అని ప్రశ్నిస్తే మీకు చేతకాని పని నేను చేస్తున్నా నంటుంది. 'పోనీ గృహనిర్వహణ భారం నేనే వహిస్తానులేవే' అని కఠినంగా అంటే, అంతకంటే కఠినంగా, నిర్దాక్షిణ్యంగా 'మీ రంతవారైతే నా కిం కేం తక్కువ–వెనకటి కొకామెట – ఆయ నుంటే మంగలో డెందు కందట' – అని చెంప దెబ్బ కొట్టింది. డబ్బును బటానీలలా నమిలి, అప్పులు చేసి భర్తకు భూలోక నరకం చూపించే నా భార్య ఉత్తమ మైందా? లేక నీ భార్య ఉత్తమమైందా? సుందర్, నీవు కాదన్నా నీ అదృష్టాన్ని నేను అభినందించకుండా వుండను–వుండలేను..." అని ముగించాడు.

సుందరానికి జ్ఞానోదయ మైంది.

మనసులో ఏవో ప్రశ్నలు కేరింతలు కొడుతున్నాయి.

ప్రయత్నం మీద పెదవులవరకూ ప్రయాణం చేసి, అక్కడే నాట్యం చేయసాగాయి.

భుజంగం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. వదనం మ్లానమైంది.

సుందరం ధైర్యంచేసి, నెమ్మదిగానే–

"భుజంగ్, ఒక్కసందేహం: మీ ఆవిడ నీకు కడుపునిండా తిండి పెట్టదా?" అని ప్రశ్నించాడు. భుజంగం త్రుళ్ళిపడ్డాడు. అయినా దాపరిక మెందుకు?

"సుందర్, ఆవిడ ఏంవంట చేస్తుందో, ఎంత పెడుతుందోగాని నాకు మాత్రం తృప్తిగా వుండదు. బతికిచెడినవాడి గతైంది నాగతి! అయితే నాభార్యకు నామీద కక్షవుందనికాదు; పరిస్థితు లలాంటివి! వాటిని అర్థం చేసుకొని, తగినట్లు సర్దుకు పోవాలనే ఆశయం. ప్రయత్నం లేని ఆడదాని పెత్తనం నింజగా తమ్మళ్ళ దొరతనముకాక మరేమిటి? అజ్ఞానానికి గయ్యాళితనంకూడా తోడైతే అగ్నిలో ఆజ్యం పోసినట్లే!"

భుజంగం తన గోడు చెప్పుకున్నాడు.


సుందరం హృదయం కరుణ వీర రసాలతో పొంగి, పొర్లి ప్రవహించింది.

"భుజంగ్, అయాం సో సారీ టు హియ్యర్ యువర్ ట్రాజిక్ స్టోరీ..." అంటూ కరుణరసం వొలికించి,

"గయ్యాళి ఆడపెత్తనం నశించాలి" అని వీరరసాన్ని దాంతో రంగరించాడు.

భుజంగం బొటబొట వేడిబాష్పాలను వదిలాడు, ముక్కు తుడుచుకుంటూ –

"సుందర్, నే నెప్పుడైనను మధ్యా




హ్నము టిఫిన్ తినంగా చూశావురా? పేగులు 'ఆకలి, ఆకలి' అని ఎంత ఘోషించినా వాటి మానాన అవి శోషపడి పోవాల్సిందే! వన్ బై టూ కాఫీఖర్చు కూడ ఆవిడగారి దయాదాక్షిణ్యా మేమీ కాదు! నీకు తెలియం దేముందీ "సైడ్ ఇన్‌కం..."లో కొంతభాగం! ఇక నిన్నటి ఖర్చంటావా, నా అదృష్టంకొద్దీ మన ఎకౌంటెంట్ పోయిన నెలబిల్లులో గ్రహపాటున రెండు రూపాయలు తక్కువజేశాడు. ఆ సంగతి చెప్పి నా భార్యను వప్పించేసరికి, వైకుంఠం వెళ్ళి వచ్చినట్లయింది. ఆ రెండూ యీ నెలలో సప్లిమెంటరీ రూపంలో నన్ను కరుణించాయి. ఆ రంథిలో నిన్ను మరచే పోయాను బ్రదర్, క్షమించు." అన్నాడు సంభాషణను మొదటికి లాక్కుపోయి.

రహదారి రానురాను జనసమర్ధంతో ముమ్మరంగా తయారవుతోంది. కన్నీటి ధారలను తుడుచుకుని భుజంగం మందంగా అడుగు వేస్తున్నాడు.

సుందరం ముఖం నిర్మలాకాశంలా ప్రశాంతంగావుంది.

అతడి మనోపథంలో కాంతం రూపం మెరిసి మరీమరీ కవ్విస్తున్నట్లుంది — కమ్మగా నవ్వుకున్నాడు.

భుజంగం సుందరాన్ని అనుసరిస్తున్నాడు.

ఆఫీసు ఆవరణలోకి ప్రవేశించగానే, సుందరం భుజంగం భుజం తడుతూ —

"డోన్‌ట్ వరీ బ్రదర్ — కష్టాలు కలకాలం కాపురం చెయ్యవని తెలుసుగా! త్వరలో మీ శ్రీమతి మారిపోతుందిలే," అని తన సెక్షన్‌లోకి వెళ్ళబోతూ ఆగిపోయాడు.

భుజంగం ప్రశ్నమార్కు ముఖం పెట్టాడు.

"ఏం లేదు సుందర్, సాయంత్రం హోటల్‌లో కలుస్తావో లేదో నని సంశయము కలిగింది. తప్పకుండా రావాలి సుమా!" అన్నాడు తేలిగ్గా నవ్వుతూ.

"అలాగే బ్రదర్, బడ్జెట్టుందిలే...!" తన సెక్షన్ వైపుగా కదిలిపోయాడు భుజంగం.

———